# దీపావళి కథల పోటీలో




పి. ఎస్. నారాయణ

*అన్యాయానికి గురిఅయిన మనసు శంకిస్తుంది. అన్యాయం తలపెట్టలేని మనసూ అదే అవస్థకు లోనవుతుంది. అన్యాయం తలపెట్టినవారు వేరు; దాని ఫలితాలను జీవితాంతమూ అనుభవించిన వారువేరు. జీవితమే అంత అని సరిపెట్టుకొనడం మాత్రం సాధ్యం కాదు.*

**సాయంసమయంలో** మేఘావృతమైన ఆకాశం నీటి తుంపరలను విరజిమ్మింది. చల్లగాలికి ఆలంబనమైన ఆ ప్రదేశం తుషార వీచికలలో మరింతగా ఒదిగిపోయింది. ఆ శానిటోరియంలోని కొందరు రోగులు శాలువలు కప్పుకొని నీటి బిందువులు గజిబిజిగా అలుముకొని ఉన్న కిటికీ అద్దాలగుండా ప్రకృతిని తిలకిస్తున్నారు.

శాంతి మొదటివార్డు ముందు మెట్లెక్కి, చేతిలోని గొడుగును ముడిచి, చిన్నగా విదిలించి, లోపలికి అడుగులు వేసింది.

"గుడ్ ఈవెనింగ్ మేడమ్!"

"గుడ్ ఈవెనింగ్!"

"ఎనిమిదో నంబరు వార్డుకే వెళ్లమంటారా, మేడమ్?"

"ఎస్...అవును! మార్పేమైనా కావాలా?"

"అక్కరలేదు మేడమ్!"

"మంచిది!"

"వెళతాను మేడమ్!

"ఊఁ..."

వెళ్లిపోతున్న శాంతిని చూస్తూ, 'చాలా మంచిది! రోగులవద్ద చాల ఓర్పును ప్రదర్శిస్తుంది!' అనుకున్నది మేట్రన్, ఆమె తన సర్వీసులో శాంతిలాంటివాళ్లను చాలా తక్కువ మందిని చూచింది.

శాంతివార్డు బయటకు వస్తూ తిరిగి గొడుగు తెరిచింది.

వెలుగు చీకటిగుహలోకి జారిపోతున్నది. దూర దూరాన ఉన్న వార్డుల మధ్య దీపాంకు, చీకటికి క్షణక్షణానికి శత్రుత్వం పెరిగిపోతున్నది. నీటి జల్లు ప్రశాంత ప్రకృతికి తీయని జోలపాట పాడుతున్నది.

శాంతి వడివడిగా అడుగులు వేసింది.

సుగుణ తనకోసం ఎదురు చూస్తూ ఉండి ఉండాలి.

ఎందుకో తన మనస్సు ఈ ప్రకృతికి, పరిసరాలకు శాంతితో నిండిపోతుంది. ఇక్కడ కాలు పెట్టి ఇంకా రెండు నెలలైనా నిండలేదు. తనకు ఈ ప్రదేశంమీద అనుకోని ఆత్మీయత ఏర్పడింది. ఎదుర్కొన్న అశాంతికి ఈ వాతావరణం ఉపశమనం కలిగిస్తున్నది.

ఎనిమిదో నంబరు వార్డులో కాలు పెట్టి, ఒక్కసారి వలుమారాలా పరికించి చూచి, ఎదురుగా ఉన్న తన గదిలోకి వెళ్లి, ముడిచిన గొడుగును మూలగా గోడకు ఆనించింది.

శాంతికోసం ఎదురు చూస్తూ కూర్చున్న సుగుణ, శాంతిని చూస్తూనే చిరునవ్వుతో లేచి నిలబడింది.

"ఇక వెళతాను శాంతీ!"

"ఇరవైనాలుగో నంబరు బెడ్ పేషెంటు ఎలా ఉన్నాడు?"

"రాత్రి గడుస్తుందనే నమ్మకం లేదు."

"....."

"ఇప్పటి వరకు డాక్టర్ రఘు ఇక్కడే ఉండి వెళ్లారు..."

"పదమూడు..."

"ఆఁ...మర్చిపోయాను! అతడు ఆకలవుతోంది, ఏమైనా ఇవ్వమని గోల చేస్తున్నాడు గాని....ఏమీ యివ్వబోకు...డాక్టర్ వద్దన్నారు.... ఈ రోజు అతడు బీడీ తాగుతుండగా డాక్టరు చూచారు. పనిష్‌మెంట్ అది!" అన్నది సుగుణ.

"....."

"పన్నెండో నంబర్ బెడ్‌కు క్రొత్త పేషెంటు వచ్చాడు!"

"ఊఁ."

"ఇక వెళతాను."

"గుడ్ నైట్!"

"గుడ్ నైట్!"

శాంతి కుర్చీలో కూర్చుని డ్రాయర్‌మీద ఉన్న 'కేస్' రిజిస్టర్ చదవసాగింది. అందులో సంగ్రహంగా ఆ వార్డులోని రోగుల పరిస్థితి, వాళ్లకు ఎప్పు డెప్పుడు ఏ మందులు ఇవ్వవలసింది వ్రాసి ఉంటుంది.

ఆ పుస్తకం చదవటం పూర్తిచేసి, లేచి పంఖా ఆపి, ఇరవై నాలుగో నంబరు పక్క దగ్గరకు నడిచింది.

"ఎలా ఉంది తాతా?"

అతడు బలహీనంగా, అతి ప్రయత్నం మీద, ఊచల్లాంటి రెండు చేతులెత్తి నమస్కారం చేశాడు. లోతుకు పోయిన కళ్లను నీటి పొరలు కప్పివేసినవి. శాంతి బాధగా తలవంచుకొని, 'పడుకో' అన్నట్లుగా చేయి ఊపి వెనుదిరిగి బరువుగా అడుగులు వేసింది.

శాంతిని చూస్తూనే పదహారో నంబరు పక్క యువకుడు లేచి కూర్చొని, "గుడ్‌నైట్ సిస్టర్!" అన్నాడు.

"గుడ్ నైట్!"

అతడి పేరు రమాకాంతం. కాలేజీలో బి. ఎ. ఆఖరి సంవత్సరం చదువుతుండగా క్షయతగిలి ఆసుపత్రిలో చేరాడు.

'కొత్త రోగి పన్నెండో నంబర్ పక్కగదూ?' అనుకొని, అటు అడుగులు వేసి అతడివంకే చూస్తూ నిలబడిపోయింది.

పొద్దున తను డ్యూటీ దిగి క్వార్టర్సుకు వెళ్ళుతుంటే అతనే గాబోలు రిక్షాలో కనబడ్డాడు. అతడిని ఎక్కడో చూచినట్లున్నది. పొద్దునా అదే అనుకున్నది.

'ఎక్కడ?'

"సిస్టర్! ఆకలవుతున్నది. మీరు ఏమీ ఇవ్వకపోయినారంటే నా ప్రాణం ఈ క్షణంలోనే పోతుంది...!" అన్నాడు పదమూడో నంబరు రోగి.

"నీకు ప్రతి చిన్న కారణానికీ ప్రాణం

# రెండవ బహుమతి పొందినది

పోతుంది సుదర్శనం. బీడీ తాగకపోయినా ప్రాణం పోతుంది. అవునుగదూ?" అన్నది గంభీరంగా శాంతి.

అతడు రైల్వే పోర్టరుగా ఉద్యోగం చేశాడట. అతడుఉద్యోగం చేసే రోజుల్లో రోజుకు మూడు కట్టల బీడీలు త్రాగేవాడట. ఈ రోజున ఆ అలవాటునుంచి తప్పుకోవటానికి యమయాతన పడుతున్నాడు.

"చెంపలు వేసుకుంటున్నాను...సిస్టర్! ఇంకెప్పుడూ త్రాగను." దీనంగా చెంపలు వేసుకొని దణ్ణం పెట్టాడు.

అతడి ప్రవర్తనకు జాలిపడి, "పూఁ..రొట్టె ఇస్తాను. గోల చేయబోకు!" అని ముందుకు నడిచింది.

కొంతమంది రోగులు అప్పుడే పడుకున్నారు. మెలకువతో ఉన్నవారు లేచి కూర్చొని శాంతికి నమస్కారం చేశారు. అందరినీ అన్ని విషయాలూ కనుక్కొని తన గదికి బయలుదేరింది.

మళ్లా సుదర్శనం రొట్టె సంగతి గుర్తు చేశాడు.

శాంతి ఒక్కక్షణం పన్నెండో నంబరు పక్క దగ్గర ఆగి, "మీ పేరు?" అన్నది.

అతడు తల ఎత్తి, "మధుసూదనం!" అన్నాడు.

ఆమె మనసు ఆలోచనలతో నిండిపోయింది. ఆమె తన గదిలోకి వెళ్లి, బీరువాలోని బ్రెడ్ తీసుకొని, ఒక ప్లేటులోపెట్టి, కొద్దిగా వెన్న గూడా దానిలో పెట్టి సుదర్శనానికి ఇచ్చింది.

సుదర్శనం దానిని చూస్తూనే సంతోషంగా ఆమెకు మరొకసారి నమస్కారం చేశాడు.

"ఇంకెప్పుడూ వద్దన్న పని చేయబోకు."

"చేయనమ్మా."

శాంతి అక్కడే నిలబడి ఒక్కసారి మధుసూదనంవంక చూచింది. అతడి లోతుకుపోయిన చెంపలు, పెరిగిన గడ్డం, తైలసంస్కారం లేని జుట్టు, చిన్న కళ్ళు—తమ మధ్య సాన్నిహిత్యాన్ని నెమరువేసుకునే బాటకు ప్రతిబంధకంగా ఉన్నవి.

ఎంతగా ఆలోచించినా అవగాహన కావటం లేదు.

మెదలకుండా వెళ్లి తన గదిలో వాలు కుర్చీలో కూర్చున్నది.

పరిసరాలు ప్రశాంతంగా ఉన్నవి. ఉండి ఉండి మెలుకువతో ఉన్న రోగుల దగ్గులు ఆ ప్రశాంతతను భగ్నపరుస్తున్నా, శాంతి ఆలోచనలు గతంలోకే పరుగెడుతున్నవి. తను నర్సు శిక్షణలో చేరక పూర్వం తన జీవితంమీద పడిన క్రీనీడల ప్రభావం తను మరువలేదు.

అంతదాకా ఎందుకు? తన అక్కయ్య!

మధురాతిమధురమైన సోదరి ప్రేమను తనకు చవిచూపిన మాధవి!....ఆమె మనోజ్ఞ మంజుల సుందర స్వరూపం కనుల ముందు గోచరించింది. ఆమె తనమీద కురిపించిన అనురాగ స్రవంతి జీవితాని కొక వెలుగుబాటై తన తనకు లేమి లోటును తీర్చి రూపురేఖలు దిద్దింది.

శాంతి కనులు చెమర్చినవి.

మాధవే తన కొక జ్ఞాపకచిహ్నమైనప్పుడు, ఆమెవలన తను పొందిన అనుభూతుల లోతులు తన మనోవేదనకు హేతువు కావడంలో ఆశ్చర్యం లేదు.

ఆమె తన తండ్రిపోయిన తరువాత, ఒకటి రెండు సంవత్సరాలలోనే మెట్రిక్ పాసయి గుంటూరులో పందరూపాయల ఉద్యోగం సంపాదించుకుంది. తన కుటుంబానికి మరొక మగవాడు లేడనే బాధను మైమరిపించింది. కుటుంబం కోసం తన సౌఖ్యాన్ని ధారపోసింది.

కాని, ఏం లాభం? ఆమెను ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు. కనిపెంచిన తల్లే మాధవిని నీచంగా తలపోసింది....ఆమె నిస్స్వార్థ త్యాగాన్ని అపార్థం చేసుకున్నది.

తనకు వివరాలు బాగా తెలియవు. కాని ఒక రోజు సంజెవేళ తన ప్రియాతిప్రియమైన అక్కయ్య మాధవి మరణ వార్తను మోసుకొని తంతి వచ్చింది. తనూ, తల్లీ వెళ్లారు రోదిస్తూ.

మాధవి ఆత్మహత్య చేసుకున్నది!

కారణం?.... మాధవి ఒక వ్యక్తిని ప్రేమించింది. అతని తీయని మాటల వెనుక విషాన్ని గ్రహించలేక...కాలు జారింది...ఫలితం—ఆత్మహత్య !

తను నిశ్చేష్ట అయింది.

అక్కయ్య మరణవార్త కంటే దాని వెనుకనున్న నిజం అమ్మను మరింత క్రుంగదీసింది...


ఆ దుఃఖంతోనే క్షీణించి క్షీణించి, దిగులుతో రెండు సంవత్సరాల క్రితం తనను అశాంతి వలయంలోకి జారవిడిచి కనులు మూసింది. తను దిక్కులేనిదైంది.

అప్పుడే తను బావ సలహాతో నర్సు శిక్షణకు దరఖాస్తు చేయటం....ఈ రోజున...

"నర్!..నర్స్! సిస్టర్!" వాకిట్లో పెద్దగా అరుస్తున్నారు.

శాంతి కలవరపడి తేరుకొని వడివడిగా అడుగులు వేసింది. ఇరవై నాలుగో నంబరు పక్క రోగి తాత నోటినుంచి నెత్తురు పక్కను వికృతం చేస్తూ కారుతున్నది. అతడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అతని తల ప్రక్కకు వాలిపోయింది.

ఒక్క ఉదుటున తన గదిలోకి వెళ్లి ఆర్. ఎమ్. ఓ. కు ఫోను చేసింది. కాని, ఆ ముసలివాని ప్రాణవాయువులు తరువాత కొద్ది క్షణాల్లోనే అనంతవాయువుల్లో కలిసిపోయినవి. ఆ దృశ్యానికి శాంతి కనులు నీటితో నిండినవి. ఆమె మనస్సంతా కలుషిత మయింది. తను డ్యూటీలో చేరిన తరువాత ఇది రెండవ చావు!



## లాభదాయకమైన లఘుపరిశ్రమ ప్రారంభించండి

"అధునాతన కుటీరపరిశ్రమలు" (తెలుగు) పుస్తకంలో లాభదాయకమైన వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలలో ఉన్నవారు చక్కటి లాభాలను ఆర్జిస్తున్నారు. ప్రతి పరిశ్రమనుగూర్చి సంక్షిప్తమైన వివరాలు, ముడిపదార్థాలు లభించేచోట్లు, ముడిపదార్థాల కొనుగోలుకు, వాయిదాల పద్ధతిన యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం యిచ్చే సహాయం—ఇందులో ఉన్నాయి. లఘుపరిశ్రమలు ప్రారంభించదలచుకున్న వ్యక్తుల సమస్యలకు తగిన పరిష్కారమార్గాలు ఇందులో ఉన్నాయి. పుటలు 878, సుమారు 300 బొమ్మలు, ధర రూ. 13. తపాలా రుసుం రూ. 1—61. ఫోన్ నం: 229835.

**COTTAGE INDUSTRY, (AWN-11) P.B. 1262, Jamuna Road Delhi-6.**




బ్రాంచీలు:— పట్నం బజారు, బ్రాడీపేట (గుంటూరు) బాపట్ల, నర్సరావుపేట, సత్తెనపల్లి, హైదరాబాదు.


## శిక్ష

ఆమె మరునాడు డ్యూటీ దిగేంతవరకు తాత ఆలోచనలతోనే గడిపింది.

ఎనిమిది గంటలకు మగుణ వచ్చిన తరువాత ఖనకు పోతూ ఒక్కసారి పన్నెండో నంబరు పక్క వద్దకు వెళ్ళింది.

అతడు అటు తిరిగి పడుకొని ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు.

అతనిని తను ఎక్కడ చూచింది?

పునర్జన్మ అనే సిద్ధాంతాన్ని నమ్మేవాళ్ళు చాలామంది ఉన్నారనేది నిస్సందేహం. ఒక్కొక్క వ్యక్తిని చూచినప్పుడు అతనిని పూర్వం ఎక్కడో చూచామనే అనుభూతి కలుగుతుంది. నిజానికి ఆ వ్యక్తిని మనం పూర్వం చూసి ఉండవచ్చు; లేక చూచి ఉండకపోవచ్చు. అప్పుడు కొందరంటారు—అతనికి, మనకు పూర్వ జన్మలో ఏదో సంబంధం ఉండి ఉంటుందని. మరునాడు సాయంత్రం వార్డులో కాలుపెట్టేటంతవరకు అతనిమీద ఆలోచనలకు ఒక రూపమిచ్చుకోలేక, ఆ సిద్ధాంతాన్నే ఈ సంఘటనకు సమన్వయం చేసుకున్నది.

విశాల విశ్వాన్ని తనలో దాచుకున్న ఆకాశం నిర్మలంగా నక్షత్రాల తేజస్సుతో మెరిసిపోతున్నది. చంద్రుడు కలువలకు ప్రియతముడైన రేడై ప్రేమవాహినిని చల్లని కిరణాలతో విరజిమ్ముతున్నాడు. శాంతి పది గంటల సమయంలో తన గదిలోనుంచి వార్డులోకి వచ్చింది. రోగులందరూ పడుకొని నిద్రపోతున్నారు. 'జీరో వాల్టు' బల్బులు బరువుగా వెలుగుతున్నవి.

పన్నెండో నంబరు పక్కవైపు చూచింది.

పక్క ఖాళీగా ఉన్నది.

ఆమె అడుగులు అటు వేసింది. మంచం మీద ఏదో పుస్తకం పడవేసి ఉన్నది.

అతడు బయటకు వెళ్ళినట్లున్నాడు.

శాంతి అనాలోచితంగా డైరీ రూపంలో ఉన్న ఆ పుస్తకాన్ని చేతిలోకి తీసుకొని మొదటి పేజీ తిప్పింది.

'అజ్ఞానంతో నిలువుకోలేని నా జీవన జ్యోతి, మాధవికి, జ్ఞాపక చిహ్నంగా—మధు.'

ఆ వాక్యానికి శాంతి కలవరపడింది!

ఈ మాధవి తన అక్కయ్యే కాదుగదా?

వడివడిగా ప్రక్క పుట తిప్పింది.

'—జీవితంలో మూసుకుపోయిన కనులతో, కుంచించుకుపోయిన హృదయంతో, జీవన సత్యాన్ని, సామాజికౌచిత్యాన్ని గ్రహించలేక, తప్పటడుగులతో తిరుగుతున్న నన్ను హృదయపూర్వకంగా ప్రేమించి లాలించి ఒక వ్యక్తిగా రూపొందించ ప్రయత్నించి విఫలురాలై ఆత్మహత్య చేసుకున్న ప్రియమైన మాధవిని నేను మరువలేను. ఆమె నా హృదయంలో ఆరిపోని జ్యోతి!

నాకు పరిచయమున్న స్త్రీల సంఖ్య ఆమెకు తెలియదు. కాని ఆమెలాంటి స్త్రీ నాకు తారస పడలేదని నేను చాలా ఆలస్యంగా తెలుసుకున్నాను. ఆమె కూడా అందరిలాంటి స్త్రీ అనే అజ్ఞానంతో గూడిన భావనలో ఉన్న నాలో జ్ఞాన జ్యోతిని వెలిగించింది; ముళ్ళతో, రాళ్ళతో నిండిన బాటలో పోతున్న నన్ను పూలబాటకు మళ్ళించింది....మాధవి! మరపురాని దేవత...మాధవి!'

శాంతి తరువాత పుట...ఆ తరువాత పుట... అలా తిప్పుతూనే ఉన్నది. దానిలోని మాటలు ఆమెను అచేతనావస్థలోకి దిగజార్చినవి. నిస్సందేహంగా అతడే...తన అక్కయ్య జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తి అతడే!...

ఒకచోట: '....నా పాపం నన్ను దహించి వేసింది. నేను ఈ రోజున ఒక భయంకర రోగంతో, కాదు...కాదు...మృత్యువుతో పోరాడుతున్నాను...పైన దేవుడున్నాడు, మాధవీ! నీకు అన్యాయం చేశాను. దాని ఫలితమే ఈ రోజున నేను అనుభవిస్తున్నాను. న్యాయం నాలుగందాలా నడిపే దేవుడున్నాడని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను, మాధవీ!'

శాంతి కనులు క్రోధంతో నిండిపోయినవి. చేతిలోని ఆ డైరీని పక్కమీదకు విసిరివేసింది. పిడికిలి బిగించి, 'నీ కీ శిక్ష చాలదు, మధుసూదనం! మామంచి ప్రియమైన మాధవిని దూరంచేసిన నీవు ఇంకా అనుభవించాలి. యమయాతన పొందాలి. నా మాధవి ప్రతి రక్తపు బిందువూ నిన్ను హతమార్చే ఒక విషబిందువు కావాలి!' అనుకున్నది శాంతి.

బరువుగా వెనుదిరిగింది.

అతడు స్నానాల గదివైపునుంచి తలవంచుకు వస్తున్నాడు. ఎముకల గూడులా ఉన్న శరీరం మీద నల్లగా, గజిబిజిగా పెరిగి అసహ్యంగా ఉన్న జుట్టున్న తలను వంచుకుని గాలిలో తేలుతున్నట్లుగా అడుగులు వేస్తున్నాడు. ఒక్కసారి తల ఎత్తి శాంతిని చూచి తలవంచుకున్నాడు. ఆ కనులు దీనత్వానికిగూళ్ళై, అతడిలోని ఆవేదనా భారాన్ని ప్రసారం చేసే మరువలేని చూపులకు నిలయాలై ఉన్నవి.

శాంతి పెద్ద పెద్ద అంగలతో తన గదిలోకి వెళ్ళి తలుపులు మూసుకున్నది. ఆమె హృదయం తీరని ఆవేదనకు లోనైంది. ఆమెలో ఆరని అగ్ని రగుల్కొన్నది. శాంతి బలంగా కళ్ళు మూసుకొని, పంటికొనలతో పెదవులు రక్కుకున్నది. చెంపలను వికృతం చేస్తూ కన్నీరు వెల్లువలా కురిసింది. ఆమె శోకదేవత అయింది.

"నర్స్....నర్స్!"

శాంతి కలవరపడి తేరుకొని, జేబురుమాలు తీసి వడివడిగా చెంపలు, కళ్ళు అద్దుకున్నది.

"ఎవరు?"

"నేను...నేను, నర్స్! పన్నెండో నంబర్ బెడ్ పేషెంటును....మధుసూదనాన్ని!"

శాంతి తలుపు తీయబోయి, ఆ మాటలకు విరమించుకొని వెనుదిరిగి, తలుపుకు బలంగా ఆనుకొని, "ఏంకావాలి?" అన్నది విసురుగా కోపం మిళితమైన కంఠంతో.

"మంచినీళ్ల కుళాయిలో నీరు రావడం లేదు నర్స్! అమిత దాహం వేస్తోంది.....మీ గదిలో ఉంటే ఇస్తారేమోనని...."

"లేవు....నా గదిలోనూ లేవు!" పెద్దగా అన్నది.

అతడు వెనుదిరిగిన సవ్వడి అయింది. అడుగుల చప్పుడు దూరమయింది. బల్ల పక్కగా నిండుగా ఉన్న నీటి కూజా ఆమెను వెక్కిరించింది. కళ్ళు మూసుకున్నది ఆమె. తరువాత కొద్ది క్షణాల్లోనే వాలు కుర్చీలో పడుకొని వలవలా ఏడ్చింది.

మరునాడు ఆలోచనాభారంతో నిండిన హృదయంతో డ్యూటీ చేయలేక సెలవుపెట్టింది. ఆమె మనస్సును మధుసూదనం పూర్తిగా కలచివేస్తున్నాడు. ఆలోచనలు ఆమెను సుడిగాలిలా చుట్టుముట్టినవి.

మధుసూదనానికి శిక్ష విధించడానికి తనెవరు? తన కుటుంబ నాశకుడిని తను శిక్షించగూడదా? తప్పు చేసినవారిని శిక్షించే శక్తి తనకు ఉన్నదా? అతనిని శిక్షించటం ద్వారా తనూ మరో తప్పు చేసినది అవుతున్నదేమో? తనూ శిక్ష అనుభవించవలసి....భగవాన్ ! అనుభవించినావరే...ఒకరోజు రాత్రి మంటలో చిటికెడు....లేదు...లేదు.... 'ఒక నిండు జీవితాన్ని చేజేతులాహతమార్చలేను'... అతడి పాపం అతనినే దహించివేస్తుంది.

ఆ రాత్రి ఆమెకు నిదురలేదు. తల దిమ్మెక్కే ఆలోచనల నడుమ భయం ఆమెను చుట్టుముట్టింది. ఒక రోగికి నిండు హృదయంతో సపర్యలు చేయవలసిందిపోయి అతని ప్రాణాన్నే తనెలా తీసుకోగలదు? తన వృత్తికే కళంకమైన ఆ పనిని తనెలా చేయగలదు?'

ఆమె ఏడ్చింది.

సాయంసమయంలో నర్సు గౌను తొడుక్కొని, నాప్‌కిన్ పెట్టుకొని, ముడిచిన గొడుగును చేతిలోకి తీసుకొని గదిలోనుంచి బయటకు రాబోతుండగా టేబుల్‌మీద మిలిటరీ దుస్తుల్లో ఉన్న శేఖరంబావ ఫోటో కనబడింది. అతడి నిర్మలమైన నవ్వును చూస్తూ అలాగే ఒక్క క్షణం నిలబడిపోయింది.

'నీవు చెప్పు బావా! నిర్మల హృదయంతో మధుసూదనానికి నేనెలా సపర్యలు చేయగలను? అతడు శిక్షకు పాత్రుడు కాడంటావా?'

అతడి నవ్వు ఆమెను విచలితను చేసింది. అలా చూసి, చూసి, బరువైన హృదయంతో గది తలుపులు వేసి రోడ్డుమీదికి వచ్చింది.

మైలు దూరంలో ఉన్న వార్డులు స్వచ్ఛమైన వెన్నెల కాంతిలో మెరిసిపోతున్నవి. శేఖరం బావమీది ఆలోచనలకు దూరం కాలేకపోతున్నది. పది సంవత్సరాల క్రితం గాబోలు అమ్మ ఏదో నెపంతో—తనకు బాగా గుర్తుకు రావటంలేదు—

పండిత
డి. గోపాలాచార్యులవార
అరుణ
స్త్రీల ఆరోగ్యసౌభాగ్యాలకు
ఆయుర్వేదాశ్రమం
ప్రైవేట్ లిమిటెడ్
మద్రాసు 17

డాక్టర్ వృత్తి చేయండి!



ఇంటిలో నిరామంగా కూర్చొని ఉండేప్పుడు పోస్టల్ ట్యూషన్‌ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజి ద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి:

INDIAN HOMOEOPATHIC COLLEGE
(A.W.P.) JULLUNDUR CITY

పోస్టు ద్వారా చిత్రకళ నేర్చుకొనండి



శ్రీ ఏ. వి. ఆర్. ప్రసాదరావు టౌన్‌హాల్ వెనుక, మెయిన్ రోడ్డు, కాకినాడ వ్రాసినది:— మీరు పంపే ప్రతి పాఠం చాలా ఆసక్తిగాను, ఆనందంగాను వున్నది.

మా విద్యార్థులనుంచి ఈమాదిరి అనేక జాబులు వస్తున్నవి. రెండు సంవత్సరాలలో మీరు ఆర్టు కోర్సు ఇంగ్లీషు ద్వారాగాని, తమిళం ద్వారాగాని నేర్చుకోవచ్చు. ప్రాస్పెక్టస్‌కు 25 న.పై. స్టాంపులు పంపండి.

( జాబులు ఇంగ్లీషులోనే వ్రాయవలెను. )

SANTHANU'S ART INSTITUTE,
Post Box No. 2740,
Chintadripet, MADRAS-2.

ఈ సంస్థ దక్షిణ ఇండియాలో సుప్రసిద్ధ ఆర్టిస్టు సంతానుచే నిర్వహింపబడుతున్నది.

బావను కొట్టింది. అదే రోజు రాత్రి తను మిలిటరీలోకి వెళ్ళిపోతున్నట్లుగా చిన్న చీటీ ముక్క వ్రాసిపెట్టి వెళ్ళిపోయాడు. తల్లీ తండ్రీలేని అతనిని చిన్నప్పటినుంచీ పెంచిన తన తల్లి వలవలా ఏడ్చింది. ఎందుకు వాడిని కొట్టావా అని బాధ పడింది.

తన బావ హృదయం తనకు బాగా తెలుసు. తామిద్దరు ఒకళ్ళ నొకళ్ళు పూర్తిగా అర్థం చేసుకున్నారు. ప్రేమంటే ఏమిటో తెలియని ఆ వయస్సులో గూడా ఒకరిమీద ఒకరు 'ఇష్టం' ఏర్పరచుకున్నారు. అలాంటి బావ ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుండి పారిపోయినప్పుడు తను పడిన ఆవేదన అంతా ఇంతా కాదు. తరువాత సంవత్సరానికి గాబోలు జాబు వచ్చింది—తాను మిలిటరీలో చేరాననీ, అలా ఇంట్లోనుంచి చెప్పకుండా వెళ్ళినందుకు ఏమీ అనుకోవద్దనీను. ఆ తరువాత తరువాత తనకు ప్రత్యేకంగా జాబులు వ్రాసేవాడు.

ఒకసారి—ఇంకా ఆ ప్రియమైన మాటలు గుర్తున్నవి....తనకు వ్రాసిన ఉత్తరంలో...

'శాంతీ !

తెలిసీ తెలియని వయస్సులో మనం చెట్టాపట్టా లేసుకొని తిరిగిన మధురక్షణాలు రాత్రిపూట టెంటులో ముతక రగ్గుమీద పడుకున్న నాలో ఆ బాధను మరిపించే సౌఖ్యాన్ని ఇస్తున్నవి. ఇప్పుడు మూలగా, కాంతిహీనంగా వెలుగుతున్న కొవ్వు వత్తికంటే నీ స్మృతులే నాకు మరింత వెలుగును ప్రసాదిస్తున్నవి. ఉండి ఉండి చుట్టూ ప్రకృతే ఉలిక్కిపడేలా ఉన్న గుబురైన చెట్లలోని భయంకర జంతువుల కదలికలు గూడా నీమీది నా ఆలోచనలకు అంతరాయం కలిగించలేకపోతున్నవి, శాంతీ!

నాలుగు సంవత్సరాల క్రితం నేను చూచిన శాంతికి, ఈ రోజు శాంతికి ఎంత తేడా ఉండి ఉంటుంది? ఆ రోజు పరికిణాలలో నన్నని రెండు జడలతో తిరిగిన ఒక పిల్ల, ఈ రోజున ఏడు గజాల చీరెలో....పోనీయ్....మూడు గజాల వల్లెలో ముడుచుకుపోయి, తన నల్లని బరువైన జడను మెల్లగా వూపుకుంటూ నడుస్తుంటే....క్రీగంట చూస్తున్నావుగదూ? నీ చూపులు చూడాలి, శాంతీ! నీ బుగ్గలు నీకు తెలియకుండానే నీలో వింత వింత అనుభూతులను కలిగిస్తూ ఎరుపెక్కినవిగదూ? నిన్ను ఎప్పుడు చూద్దామా అని నా మనస్సు తహతహలాడుతున్నది, శాంతీ!

చుట్టూ ఉన్న కొండలు నిద్రపొమ్మంటున్నవి.

ఉంటా.

నీ బావ

శేఖరం.'

ఆ మాటల వెలుగు ఆమె హృదయంలో దేదీప్యమానంగా వెలిగింది. ఆమె పరిసరాలు, పరిస్థితులు మరిచిపోయింది. ఆమె పెదిమలు చిరునవ్వు వీచికల తాకిడికి అల్లల్లాడినవి...

తన హృదయంలో మాటిమాటికీ రేగే అతడిని చూడాలనే ఆకాంక్షను ఎన్నిసార్లు ఉత్తరాల్లో తెలియబరచలేదు?

ఈలోగానే అనుకోకుండా మాధవి—తన ప్రియమైన అక్కయ్య—మరణించింది.

ఆ మాటలు గుర్తుకు వచ్చినప్పుడు శాంతి మామూలు మనిషైంది. దూరాన కనబడిన వార్డులు దగ్గరయినవి. ఆమె తల వంచుకొని వార్డులో కాలుపెట్టింది. ఆమె యాంత్రికంగా అన్ని పనులూ పూర్తిచేసుకొని తన గది తలుపులు మూసి, వాలు కుర్చీలో అద్దాల కిటికీలలోనుంచి తనను చుట్టివేసిన కొండలను చూస్తూ పడుకుంది.

తన బావా ఈలాగే కొండలతో, గుట్టలతో చుట్టివేయబడి ఉంటాడు గాబోలు! ఎందుకు ఈరోజు బావమీది ఆలోచనలనుంచి దూరం కాలేకపోతున్నదో ఎంతగా ఆలోచించినా అర్థం కావటంలేదు. మిలిటరీ దుస్తుల్లో ఉన్న అతను ఫోటోలోనుంచి లేచి వచ్చి తనముందు తారట్లాడుతున్నాడు...ప్రేమతో స్పృశిస్తున్నాడు.

'బావా!'

మాధవి మరణవార్త బావకు వ్రాసింది. కాని తన అక్కయ్య అలాంటి నీచపు పని చేసి చనిపోయిందని తెలిస్తే తన కుటుంబాన్నే హీనంగా చూస్తాడనే సంకుచితభావంతో, తన అక్కయ్య కారు ప్రమాదంలో చనిపోయినట్లుగా తెలియబరిచింది. తను బావకు దూరం కాలేదు. అతనిని తను దూరం చేసుకోలేదు. అందుకనే అబద్ధమాడడానికి గూడా సంకోచించలేకపోయింది.

ఆ వార్త విని ఎంతో విచారాన్ని వ్యక్తపరిచాడు. తనప్పుడు రాలేని స్థితిలో ఉన్నాననీ, వీలున్నంత త్వరలో వస్తాననీ వ్రాస్తూ కొంత డబ్బు పంపించాడు. అప్పటినుంచీ ప్రతి నెలా డబ్బు పంపటం మొదలుపెట్టాడు.

మానని గాయమే రేగినట్లుగా అమ్మ మరణం.

అదీ వ్రాసింది బావకు.

శాంతికనులు చెమర్చినవి....

అతడినుంచి ఆవేదనతో గూడిన సానుభూతిని పొందింది. బాధపడుతూ జాబు వ్రాశాడు: 'నేను ఇప్పుడు అక్కడికి రాలేని అశక్తతతో ఉన్నాను, శాంతీ. వీలైనంత త్వరలో నీ ముందు ఉండాలని ప్రతి క్షణమూ ప్రయత్నిస్తున్నాను. ధైర్యంగా ఉండు, శాంతీ. ఇక మిలిటరీనుంచి డిస్చార్జి అయి వస్తున్నాను. గడిచిన కష్టాలను మరిపించి మనలను మురిపించే రోజులు త్వరలోనే వస్తున్నయ్యనే పరిపూర్ణ విశ్వాసం నాకు ఉన్నది.'

అమ్మ పోయిన కొత్తల్లో తన కేమీ తోచేది గాదు. ప్రొద్దస్తమానం ఇంట్లో గడిచిన స్మృతులను నెమరువేసుకుంటూ, కన్నీరు కారుస్తూ బావకు జాబు వ్రాసింది.

నర్సుగా శిక్షణ పొందమని బావ సలహా!

అదీ అయింది.

రెండు నెలల క్రితం ఈ ఉద్యోగంలో చేరింది—కాని ఈలాంటి విషమ పరీక్షను ఎదుర్కోవలసి వస్తుందని లీలగానైనా గోచరించలేదు ఆరోజు.

ఉద్యోగంలో చేరిన రోజున బావకు సంతోషంగా జాబు వ్రాసింది.

'బావా!

కొడిగట్టబోతున్న దీపానికి నూనెపోసి వత్తి పెద్దది చేశావు. తుఫానులో నావలా కొట్టుకుంటున్న పరిస్థితులలో నీ సహాయ సహకారాలు తిరిగి నన్నొక మనిషిగా నిలబెట్ట గలిగినవి. ఈ రోజునే శానిటోరియంలో నర్సుగా చేరాను. నీకు కృతజ్ఞురాలిని, బావా.

నాలో ఇక ఏ కోరికా లేదు—నిన్ను పూజించాలనే ఒకే ఒక కోరిక తప్ప.

ఉంటా. శాంతి.'

తరువాత నాలుగు రోజులకు గాబోలు బావ నుండి తనకు జాబు వచ్చింది.

'శాంతీ !



ప్రేమికులు

చిత్రం—శ్రవన్నరావు (విజయనగరం)

ప్రతిదీ మన చేతిలోనే ఉన్నదనుకోవడం, మన మేధో చేయగలం అనుకోవడం బుద్ధి తెలివి తక్కువ. పైన భగవంతు డున్నాడు. నీవు వ్రాసినట్లుగా తుఫానులో కొట్టుకుంటున్న నావను దరిజేర్చడంలో మానవుడే గొప్పవాడనుకోవడం పొరబాటు. తన అద్వితీయమైన మేధా సంపత్తితో మనల నందరినీ నడిపే భగవంతుడు ఉన్నాడు. ఒక రోజున మూసుకుపోయిన కళ్ళతో నమ్మలేని ఆ నిజాన్ని ఈ రోజున నమ్మక తప్పటం లేదు !!

నా శాంతి శాంతి పొందిందంటే నాకుగాక మరెవరికి ఆనందం?

నేను రెండు మూడు నెలల్లోనే డిస్చార్జి అయి వస్తున్నాను.

శేఖరం.'

'పిచ్చిబావ! వేదాంతి అయినట్లున్నాడే!'

**ఆదాయము కావాలంటే**



ఇంటింటా కుట్టుపనిచేర్చి మీ సొమ్ము ఆదాచేయండి. నేర్చుకొనుటకు ప్రత్యేక గ్రంథం — అందరు టైలర్లే.రు. 5/— 266 పే. 180 బొమ్మలు, అందమైన పుల్ క్యాలికో బైండు. బెతాయింపు రు. 3—50. కత్తిరింపులు రు. 1/—. రహస్యబోధిని రు. 0—62. ఈ 4. తెలుగు వి. పి. అదనము.

జి. పున్నారావుచౌదరి,
మోపర్రు, తెనాలి తాలూకా.

**కుట్టుపని స్వబోధిని**

కుట్టుపనిని ఇతరుల సహాయం లేకనే నేర్చుకొనుటకు ఇది సహాయపడుతుంది. వెల పోస్టు ఖర్చుతో సహా రూ. /4—

**కొక్కోక శాస్త్రము**

వివిధ చిత్ర పటములతో కలది. వెల పోస్టు ఖర్చులతో సహా రూ. 2—25. దాంపత్య రహస్యములు, బొమ్మలతోకూడినది పోస్టుఖర్చుతో రూ. 4—00.

**ELDIAR & CO.,**
**11, Bashiakarlu Naidu St., Madras-1.**

**సినీ తారల ఫొటోలు**

మీ అభిమాన సినీతారల ఒరిజినల్ ఫొటోలు అందమైన పోజులలో కారు సైజు డజను వెల రు. 5/- పోస్టేజి రు. 1/- అదనం.

**సినీ ఫొటో డిస్ట్రిబ్యూటర్సు**

(పి. ఓ.) రేలంగి, (ప. గో. జిల్లా)

**డ్రాయింగ్ & పెయింటింగ్ గైడ్**

610 చిత్రములు కలవు. దీని సహాయంతో ఫ్రీ హాండ్ డ్రాయింగు, పెన్సిల్ డ్రాయింగు. పెన్సిల్సు. కలరు స్కీంతో పెయింటింగు ఇతర డ్రాయింగు పనులు నేర్చుకోవచ్చు. మీరు డ్రాఫ్ట్స్‌మెన్‌గాను, డ్రాయింగు మాస్టరుగాను, పెయింటరుగాను, డిజైనరుగాను (ఆర్టిస్టు) తయారుకావచ్చును. 2 భాగాల ధర రు. 8—8 పోస్టేజి రు. 2/— ఎంబ్రాయిడరీ డిజైనుబుక్కు రు. 5/— పోస్టేజి రు. 1/—నూరు బొమ్మలతో వివాహ జీవితం రు. 5/— పోస్టేజి రు. 1/—.

**ILFA BOOK DEPOT., (P.T. 5)**
**Rafatganj, Aligarh (U.P.)**

దీపావళి శుభాకాంక్షలు

**Grams: RAM SANITARY** **Phone: No. 1210 Office. No. 1131 Res**

**శ్రీ రామా శానిటరీ స్టోర్సు,**

డిస్ట్రిబ్యూటర్సు: ప్యారీ & కో లిమిటెడ్ (శానిటరీవేర్)
ఆథరైజ్డు స్టాకిస్టు: హైదరాబాదు యాస్‌బెస్టాస్ సిమెంటు ప్రొడక్టు లిమిటెడ్
శివాలయం వీధి, :: విజయవాడ—1.
బ్రాంచి:— ప్రకాశం రోడ్, గవర్నరుపేట, కమ్మ హాస్టలు ఎదురుగా. మా వద్ద "ప్యారీ" కంపెనీ శానిటరీ సామానులు, "చార్‌మినార్" డోరియా, సాదా రేకులు, సిమెంటు పైపులు, స్టోన్‌వేర్ పైపులు హోల్‌సేల్‌గాను, రిటైలుగాను విక్రయించబడును.

NAVIN

దీపావళి కివే మా శుభాకాంక్షలు

**Grams: SWATANTRA** **Phone No. 334**

**స్వతంత్ర ఎంటర్‌ప్రైజెస్**

**టైప్ ఫౌండర్సు & బ్లాక్ మేకర్సు**

**పోస్టు బాక్సు నెం. 342, బకింగ్‌హాంపేట P. O.**

**విజయవాడ-2.**


## శిక్ష

అనుకున్నది నవ్వుకొని తను ఆ రోజున.

"నర్స్! నర్స్!"

శాంతి ఉలిక్కిపడి లేచి వెళ్లి తలుపుతీసింది.

మధుసూదనం!

అతడిని చూస్తూనే మరింత కలవరపడింది.

"ఏమిటి? ఏంకావాలి?" అన్నది విసురుగా.

"మీతో ఒక్కక్షణం మాట్లాడాలి, నర్స్!"

"ఏం మాట్లాడాలి?"

"లోపలికి వచ్చి రెండు నిమిషాలు కూర్చుంటాను, నర్స్. మీ పనికి ఆటంకం కలిగిస్తున్నందుకు క్షంతవ్యుడిని!" ముందుకు రాసాగాడు.

శాంతి కోపంతో విసురుగా వెళ్లి కిటికీ దగ్గర వెలుపలికి చూస్తూ నిలబడింది. మధుసూదనం స్టూలుమీద కూర్చున్నాడు,వచ్చేదగ్గును ఆపుకుంటూ. ఆయాసంతో అతడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. కొద్ది క్షణాల తరువాత గొంతు పెగుల్చుకొని, మాటాడబోయి, తడబడి, "నర్స్! నర్స్, మీరు ఎక్స్‌రే చూశారుగదా? నాకు త్వరలోనే తగ్గుతుందంటారా?" అన్నాడు.

ఆ మాటలకు వెనుదిరిగి అతడి ముఖంలోకి తీక్షణంగా చూస్తూ, కఠినంగా "ఏం! ఏ స్త్రీనైనా ప్రేమించారా? పెండ్లి చేసుకుంటానని మాట ఇచ్చారా?" అన్నది.

ఆమె కనులు కోపంతో ఎరుపెక్కినవి.

ఆమె మాటలకు అతడు ఉలిక్కిపడ్డాడు. పాలిపోయిన ముఖంతో శాంతివైపే చూస్తూ నిర్జీవంగా కూర్చున్నాడు.

"నర్స్!"

కుపిత స్వరాన్ని గంభీరంగా మార్చి, "మిస్టర్ మధుసూదనం! మీలో ఆ వ్యాధి తీవ్రంగానే ఉన్నదని చెప్పటానికి విచారిస్తున్నాను. మీరు ఏలాంటి కోరికలతో కలలు కనవద్దని నా హృదయపూర్వకమైన సలహా!" అని ఒక్కసారి అతడి లోతుకుపోయిన కళ్లల్లోకి ద్వేషంగా చూచి తల ప్రక్కకు తిప్పుకున్నది.

అతడి ముఖం వల్లబడిపోయింది. స్మృతిహీనుడయ్యాడు. కనురెప్పలు బరువును మోయలేనట్లుగా వాలిపోయినవి. మూసుకుపోయిన కనులనుంచి చెంపలకు వికృతం చేస్తూ నీరు జలజలా కారింది.

అతనిని చూచి జాలి తలచవలసిన ఆమె మనస్సు తృప్తిగా నవ్వుకున్నది. స్త్రీ లోలత్వంలో మత్తెక్కిన అతడి శరీరం తన మాటలకు వాడిపోయి, ఎండి, బీటలు వారుతుండాలి! ఆ ప్రదేశాన్ని నిశ్శబ్దం చీకటిలా రాజ్యం చేస్తున్నది.

అతడు వ్రక్కలయిన హృదయంతో లేచి నిలబడ్డాడు. కన్నులు నీటి ధారలను ఉరవడిగా కురిపిస్తున్నవి. అతడు తదేకంగా రెండు నిమిషాలు శాంతి ముఖంలోకి చూచి, నిట్టూర్పు విడిచి, తలుపువైపుకు అడుగులు వేశాడు. అతడి శరీరం క్షణ క్షణానికి తేలికైపోతూ కూలి

పోయేలా ఊగుతున్నది. తలుపుదాకా వెళ్లి ప్రయత్నంమీద ఆగి, "నేను శాంతికి దూరమయిపోతున్నాను! నాకిక శాంతిలేదు!" అని దీనంగా గొణుక్కున్నాడు.

ఆ మాటలకు శాంతి అప్రతిభురాలై తల ఎత్తి వాకిలిదాటి వెళ్లిపోతున్న అతనిని చూడ సాగింది. అతడిమీద కోపంతో కరుడు గట్టిన ఆమె మనస్సును గూడా ఆ మాటలు కదిలించి





పేరంటానికి — చిత్రం—వై. బాలయ్య (నారాయణరావుపేట)

# శిక్ష

వేసినవి! ఆమె కుర్చీలో కూర్చొని, చేతిని బల్ల మీద పెట్టి తల ఆనించి, కనులు మూసు కున్నది. కనులు జలార్ద్రాలయినవి. ఆమెకు తెలియకుండానే ఆమెలో పేరుకుపోయిన కోపం మంచులా కరగ సాగింది.

'ఎంత శత్రువైనా వ్రక్కలయిన హృద యంతో వచ్చినప్పుడు అతడి హృదయాన్ని మరింత ముక్కలు చేసిపంపటం ఏమి న్యాయం?' అనుకున్నది. 'అందునా ఎంత కష్టం?'

ఆమె భావోద్రేకంలో అశాంతికి లోనయింది. తను చేయగూడని పని చేసి అతడి జీవితాన్ని అధ్వాన్నం చేసింది. అతడి ఆశాలత విచ్ఛిత్తికి పాల్పడింది. ఇరవయి అయిదు సంవత్సరాలకే నూరేళ్లు నిండినవనే నిరాశను అతడిలో కలి గించింది. నిజానికి అతడిలో అనుకున్నంత తీవ్రంగా ఆ జబ్బు ఏమీలేదు. కష్టపడి జాగ్ర త్తగా నాలు గయిదు నెలలు మందు తీసుకుంటే పూర్తిగా తగ్గిపోతుంది. కాని, అతడిలో ఆ వ్యాధి తగ్గుతుందనే పరిపూర్ణ విశ్వాసముండాలి. ఈ రోజున అదే అతడిలో లోపించేలా కావాలని చేసింది. జీవితంలో ఇక అతడికి సుఖంలేకుండా చేసింది.

ఎక్కడో కొండఅవతలనుంచి నక్క అరుపు వినిపించి మేను కంపించింది.

తను పాపి!

కొన్ని క్షణాలు ఆత్మక్షోభను అనుభవించింది. అంతలోనే మాధవి గుర్తుకు వచ్చింది. తన అక్కయ్య జీవితం అతడు నాశనం చేయలేదా? ఆశపెట్టి, సుగంధభరితమైన కోరికలతో మభ్య పెట్టి, అనుభవించి, గోతిలో త్రుంచివేయ లేదా? ఇంకా తనేనయం. కొంతగాకపోతే కొంత యినా తన మాటల్లో నిజమున్నది కాని....కాని అదే అతడి మరణానికి హేతువవుతుందనేది నిస్సందేహం. అయితే అది తన తప్పా? కాదు. అతడి బలహీనత అవుతుంది. ఎందరి జీవితాలనో నాశనం చేసిన అతడికి తన జీవితంమీద ఎందు కంత మమత?

ఆమెను ఆ క్షణంలో అతడిమీద క్రోధము, జాలి, మమత, ద్వేషం, అసహ్యం, అనురాగం పెనవైచుకొని నీటినుంచి బయటపడి కొట్టు కునే చేపలా చేసినవి.

క్షణంలో అతడి మోము ఆమె ముందు మెసలింది. అతడి దీనమైన కళ్లు ఆమె చుట్టూ గిరగిరా తిరిగి ఆమెను నలిపివేసినవి. లోతుకు పోయిన చెంపలతో, గజిబిజిగా రేగి ఉన్న జుట్టుతో ఉన్న అతని ఆకృతి ఆమెకు వివశత్వం కలి గించింది.

అతడు పోతూ పోతూ ఒక్క క్షణం ఆగి, 'నేను శాంతికి దూరమయిపోతున్నాను! నాకిక శాంతిలేదు!' అన్న మాటలు గుర్తుకు వచ్చి నప్పుడు ఆమె హృదయం బ్రద్దలయింది. కళ్లల్లో నీరు ఉబికి ఉబికి పొర్లింది.

"భగవాన్!"

రెండు చేతుల్లో ముఖాన్ని ఇరికించుకొని వలవలా ఏడ్చింది.

ఈరోజున మధుసూదనాన్ని మానసికంగా హింసించి, అతని నాశనానికి హేతువు కావడం వలన తన అక్కయ్య తిరిగి వస్తుందా? జరిగి పోయిన అన్యాయానికి ఇప్పుడు విరుగుడువేసి న్యాయం అనగలమా? లేదు....లేదు...తన వృత్తి ధర్మాన్ని తను మరువలేదు...అతడు చేసిన పాపా నికి భగవంతుడే ప్రాయశ్చిత్తం చేస్తాడు....తను ఆ పని చేయలేదు.. తను చేయగూడదు గూడా!

ఇక ఆమె ఆ భావోద్వేగాన్ని ఆపుకోలేక పోయింది. 'ఇప్పుడే చెబుతాను. త్వరలోనే తగ్గి పోతుంది, ఏలాంటి భయమూ పడ్డని ఇప్పుడే మధుసూదనానికి చెబుతాను...నేని బాధ భరించ లేను!' అనుకొని వడివడిగా లేచి వాకిలివైపు అడుగులు వేసింది.

వార్డు మధ్యలో ఉన్న గడియారం గుండె ఝల్లుమనేలా ఒంటిగంట కొట్టింది. ఆమె గది ముందు నిలబడి నిశ్శబ్దానికి నిలయంగా ఉన్న వార్డులోకి చూచింది. అందరూ నిద్దర్లు పోతున్నారు. తన సంకుచిత హృదయంలాగానే 'జీరో వాల్టు' బల్బులు బరువుగా వెలుగుతున్నవి.

మధుసూదనాన్ని చూడాలనే ఆత్రంతో పన్నెండో నంబరు పక్కవైపు దృష్టి సారించి నిర్భాంతితో, నిర్జీవంగా నిలబడిపోయింది.

పక్క ఖాళీగా ఉన్నది! పరుగెడుతున్నట్లుగా అడుగులు అటువేసింది. బెడ్‌మీద తనను వెక్కి రిస్తున్నట్లుగా ఒక కవరు పడి ఉంది. ఆత్రంగా దానిని చేతిలోకి తీసుకొని దానిమీద తన పేరే ఉండటం చూచి మరింత ఆశ్చర్యపోయి, తడబడే కాళ్లతో తన గదిలోకి పరుగెత్తి, తలుపులు మూసి, కవరు చించింది.

'శాంతీ!

కలలుగన్న హృదయం నిరాశా నిస్ప్రహలకు నిలయమై పోయింది. కోరికలు గగన కుసుమా లైనవి. శాంతికి దూరమయిన నేను జీవించి ఏంలాభం?

ఎన్నో ఆశలతో ఉవ్విళ్లూరుతున్న నన్ను అధఃపాతాళానికి తోస్తూ ఈ వ్యాధి కౌగలించు కున్నది....నిన్ను ఎప్పుడు చూద్దామా అని ఆత్రుత జెందుతున్న నా హృదయాన్ని నలిపి వేస్తూ క్రుంగదీసింది.

శాంతీ! ఇక నీ బావ నీకులేడు. నాకు శాంతి లేదు. నేనం ఏ జన్మలో చేసిన పాపమో ఈ జన్మలో ఆగర్భశత్రువై నన ఎదుట తిష్ఠ వేసుకు కూర్చున్నది.

మిలిటరీ నుంచి డిస్చార్జి అవుదామని ఆనం దంగా ఎదురు చూస్తున్న రోజాకంటే ముందు గానే డాక్టర్లు నాలోని ఈ జబ్బును గుర్తించి బలవంతాన పంపివేశారు.

ఇక నేను ఎక్కడికి వెళ్లేది? ఏముఖం పెట్టు కొని నాకోసం కన్నులు విస్తృతం చేసుకొని ఎదురు చూస్తున్న శాంతి దగ్గరికి వెళ్లేది? ఎన్నో ఆశలు రేకెత్తించిన ఆమెకు ఏమని జవాబు చెప్పుకోగలను?

తల పగలగొట్టుకొని ఏడ్చాను. ఏంచేయాలో తోచలేదు. చివరికి ఒక నిశ్చయానికి వచ్చాను. మధుసూదనంగా, నీవు పనిచేస్తున్న శానిటోరియం లోనే కాలు పెట్టాను. ఈ వ్యాధి తగ్గి మామూలు మనిషి నవుతాననుకుంటే నిజం నీకు చెబుదా మనుకున్నాను. లేకపోతే మధుసూదనంగానే నిన్ను చూస్తూ ఆ తృప్తితోనే మరణిద్దామనుకున్నాను. కానీ శాంతీ! నీ నోటి ద్వారానే నా స్థితి నేను తెలుసుకొని ఇక్కడే నిన్ను చూస్తూ నేనెలా కాలం గడపగలను? నా హృదయం వ్రక్క లయింది. వెళ్లిపోతున్నాను, శాంతీ...ఏ సుదూర తీరాలకో నా ఈ కొద్ది శేషజీవితాన్ని గడిపే టందుకు.

ఈ అసమర్థుడైన నీ బావను మరిచిపో, శాంతీ.

ఒక్కమాట—నా ఆప్త మిత్రుడు మధు గూడా ఈ భయంకర వ్యాధితోనే మరణిస్తూ, తన డైరీని జ్ఞాపక చిహ్నంగా నాకు పంపాడు. అది నేను ఆసుపత్రిలో వదిలివెళ్లుతున్న పుస్తకాల ల్లోనే ఉన్నది. నీవు దానిని తీసి భద్రపరుచు! అందువలననైనా వాని ఆత్మ శాంతిస్తుందని నా ఆశ!

నీకు ఆశీస్సులకంటే ఏమీ యివ్వలేని నీ బావ,

శేఖరం.' ★